
బిక్కవోలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళి


రామవరంలో కేక్ కట్ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి, దుర్గారెడ్డి తదితరులు


పెదపూడిలోని వినాయక గుడి సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న పార్టీ శ్రేణులు


కోరుకొండ బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభ్యున్నతి

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- మహానేత విగ్రహాలకు నివాళి
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు

పెదపూడి: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభ్యున్నతి సాధ్యమని, రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా ప్రజల మద్దతుతో విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనపర్తిలోని ఎర్ర కాలువ వంతెన వద్ద గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టించి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, బిక్కవోలు మండల పార్టీ కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, అనపర్తి సర్పంచ్ వారా కుమారి, నియోజకవర్గం బీసీసెల్ కన్వీనర్ కొండేటి భీమేష్, లీగల్ సెల్ కన్వీనర్ వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, వాణిజ్య సెల్ కన్వీనర్ సత్తిబాబు, స్థానిక టౌన్ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహన్ బాలకృష్ణారెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లభశెట్టి రామ సతీష్, బులి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

రాష్ట్రంలో ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి కేక్ చేసి జెండాను ఎగురవేశారు. పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, నాయకులు కర్రి రుక్మిణీ కుమారి, మంగిరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, కె.సుధాకర్ రెడ్డి, కర్రి గోపాలరెడ్డి, నల్లమిల్లి బుజ్జి, నల్లమిల్లి ఆదినారాయణరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, లంక శ్రీను, గుత్తుల శ్రీను, గుత్తుల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. కాగా.. పెదపూడి, జి.మామిడాడ, పెదాడ, కైకవోలు, చింతపల్లి, కాండ్రేగుల తదితర గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు కొల్లు లోవకుమారి, డొకుబుర్ర మీనాక్షి, నియోజకవర్గం చేనేత విభాగం అధ్యక్షుడు పప్పు సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు సుందరపల్లి సుధాకర్, సమ్మంగి దుర్గాప్రసాద్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు.


అనపర్తిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పేదలకు అండ

బిక్కవోలు: పేదలకు అండగా వైఎస్సార్ సీపీ జెండా ఉంటుందని ఆ పార్టీ నాయకుడు గువ్వల సత్తిరెడ్డి అన్నారు. బిక్కవోలు గ్రామంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఎగురవేశారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు (తోటలో రాజు), మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు.

- రఘుదేవపురంలో ఎంపీటీసీ పంతుల వెంకటేష్, వార్డు మెంబర్లు పిండి రాధాకృష్ణ, లుగాలపు మల్లేశ్వరరావు, ఆకాశపు రాజు, నిడదవోలు శ్రీను తదితరులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్ పార్టీ జెండాను ఎగురవేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు. పంతుల శ్రీను, యలమాటి కాశీ, యలమాటి సురేష్, కాండ్రు వెంకటరాజు, చుండ్రు సత్యం పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలను కూటమి ప్రభుత్వం వంచన చేస్తోందని వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలాధ్యక్షుడు అడపా కనకరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోరుకొండ తదితర గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేశారు. అలాగే కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరుకొండ ఉప సర్పంచ్ నేతుల చిన్ని, మాజీ సర్పంచ్ నీరుకొండ బాబ్జీ, పార్టీ నాయకులు బొరుసు బద్రి, కంటే వినయ్ తేజ, పసుపులేటి బుల్లియ్య నాయుడు, సీతానగరం మండలం కూనవరం ఎంపీటీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


రాజానగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


సీతానగరం మదర్‌థెరిస్సా సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


రఘుదేవపురంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఐక్యంగా ముందుకు సాగుదాం

రాజానగరం: ప్రజలలో వైఎస్సార్ సీపీపై ఆదరణ, అభిమానం చెక్కుచెదరలేదని, దానిని మరింత బలోపేతం చేస్తూ, పార్టీని పటిష్టపరిచే విధంగా ఐక్యంగా ముందుకు సాగుదామని సీనియర్ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజానగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్‌ని కట్ చేశారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి


అనపర్తిలో సీతారాములను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పాత ఊరులో సీతారామ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి భక్తులు, దాతలు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వల్లూరి భార్గవ రామారావు అండ్ బ్రదర్స్, చాట్రాది రామస్వామి, కొవ్వూరి కృష్ణమూర్తి డాక్టర్ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ-క్రాప్ జాబితా

పెదపూడి: మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శనకు ఉంచామని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన దోమాడ గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో ఈ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 17,267 ఎకరాల్లో సుమారు 11,104 మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఈ నెల 19వ తేదీలోపు రైతులు ఆ జాబితాలో తప్పులుంటే సవరించుకోవాలన్నారు. అనంతరం తుది జాబితాను ప్రచురిస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మీనవల్లి శారదాదేవి, రైతులు మీనవల్లి సత్తిబాబు, ముత్యాల శ్రీను, వ్యవసాయ సహాయకుడు దేవగుప్తాపు శ్రీను పాల్గొన్నారు.


దోమాడలో జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ మణిదీప్ తదితరులు

బంగారు గొలుసు, చెవిదుద్దుల చోరీ

సీతానగరం: రఘుదేవపురంలోని ఓ ఇంటిలో బంగారు ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తుపు నాగజ్యోతి, తన భర్తతో కలిసి బుధవారం తెల్లవారుజామున పొలం పనులకు వెళ్లింది. పదో తరగతి చదువుతున్న కుమార్తె ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లిపోయింది. అనంతరం మధ్యాహ్నం నాగజ్యోతి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి, బీరువా తాళం పగలుకొట్టి ఉన్నాయి. దానిలోని 8 గ్రాముల చైన్, 17 గ్రాముల నాలుగు జతల చెవిదుద్దులు మాయమయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్

పెదపూడి: వ్యక్తిపై దాడి చేసి, స్థానికులను భయభ్రాంతులకు గురి చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని ఎస్సై కె.రామారావు తెలిపారు. సంపరలో ఈ నెల 9వ తేదీ రాత్రి ఆ గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరరావుతో ఎలుగుబంట్ల శ్రీరామ్ ఘర్షణకు దిగాడు. చంపుతానని బెదిరించి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో వెంకటేశ్వరరావుకు బలమైన గాయాలయ్యాయి. అలాగే స్థానిక ప్రజలను కూడా శ్రీరామ్ భయభ్రాంతులకు గురి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి కాకినాడ కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడు అందరితో గొడవలకు పాల్పడుతున్న నేపథ్యంలో రౌడీషీట్ ఓపెన్ చేశామని ఎస్సై తెలిపారు.

అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం


కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ 1.0 పథకాల ద్వారా జిల్లాలోని 429 లే అవుట్లు, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11,345 మంది ఎస్సీలు, 549 మంది ఎస్టీలు, 15,547 మంది బీసీలకు రూ.138.57 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల మేర అందిస్తామన్నారు. దీనిని వినియోగించుకుని, వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయిన వారు మే నెలాఖరులోగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల వారీగా అనపర్తిలో 3,926, రాజానగరం 2,530, రాజమండ్రి రూరల్ 2,082, రాజమండ్రి సిటీ 4,987, కొవ్వూరు 4,611, నిడదవోలు 3,825, గోపాలపురంలో 5,480 మందికి ఈ సాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

'నన్నయ'లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు


ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో వేసవిలోనే కాదు ఏ కాలంలోనూ నీటి ఎద్దడి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. క్యాంపస్‌లోని వసతి గృహాలలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడి నివారణపై ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడనన్నారు. వేసవి కాలం వచ్చిన నేపథ్యంలో ఈ సమస్య మరింత జటిలమయ్యేందుకు అవకాశం లేకపోలేదన్నారు. దీనిని గుర్తించి క్యాంపస్‌లో అదనంగా మరో మూడు బోర్లు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించానన్నారు. విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని, గ్రిడ్ ద్వారా యూనివర్సిటీ క్యాంపస్‌కి నీరు సరఫరా చేయాలని కోరామన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని భూభాగమంతా రాళ్లు, సుద్దమయంగా ఉండటంతో వేసిన బోర్లు తరచూ రిపేర్లు వచ్చి, నీటి సమస్య ఎదురవుతుందన్ని గ్రహించామన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు.

ఈ-పంట, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఖాసిమ్

రాజానగరం: అన్నదాతలకు మెరుగైన సేవలు అందించేందుకు రూపొందించిన ఈ-పంట, ఈ-కేవైసీలను తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ రైతులకు సూచించారు. మండలంలోని పాలచర్లలో బుధవారం ×పొలం పిలుస్తుంది॰ కార్యక్రమం జరిగింది. రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను పొందేందుకు, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలను పొందేందుకు ఈ రెండు ప్రక్రియలు తప్పనిసరి అన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ తమ శాఖ ద్వారా నూరు శాతం రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలను సరఫరా చేస్తున్నామన్నారు. ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకమైనదంటూ మార్కెటింగ్ సదుపాయాలు, చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగులో బిందు సేద్యం ఎంతో ప్రధానమైనదని, ఇందుకు అవసరమైన పరికరాలను కూడా రాయితీపై సరఫరా చేస్తున్నామన్నారు. వీటిని పొందాలంటే ముందుగా సమీపంలోని రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. అలాగే మామిడి, జీడిమామిడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాల దరఖాస్తుకు 22 వరకూ గడువు

సీతానగరం: స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 22 వరకూ గడువు ఉందని ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీలోని ఎ,బి,డి,ఈ వర్గాలకు చెందిన వారు, ఫార్మసీ చదువుకున్న యువత, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులు, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ, కాపు, సామాజిక వర్గాలకు వివిధ పథకాల కింద బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీతో ఆర్థిక సాయం మంజూరు చేస్తామన్నారు. వీటికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోనుటకు ఈనెల 22 వరకు గడువు ఉందన్నారు. నెట్ సెంటర్, మీసేవ, సచివాలయంలో https://apobmms.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బిక్కవోలు: మండలంలోని 2024-25 సంవత్సరంలో వెనుకబడిన తరగతులు చెందిన వారు వివిధ పథకాల ద్వారా సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 22వ వరకూ ఆన్ లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు.

రాజానగరం: నిరుద్యోగ యువత స్వయం ఉపాధిని పొందేందుకుగాను దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. వెనుక బడిన వర్గాలు (బీసీలు), ఈబీసీలకు చెందిన నిరుద్యోగులు స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీస్‌ని ఏర్పాటు చేసుకునేందుకు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనరిక్ ఫార్మసీస్ కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా డి.ఫార్మసీ/బి.ఫార్మసీ/ఎం.ఫార్మసీ చదివి ఉండాలన్నారు. అలాగే మేడార, కుమ్మరి, శాలివాహన వర్గాల వారికి వృత్తిపరమైన స్వయం ఉపాధిని ఏర్పాటుచేసుకునేందుకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

- జేసీ చిన్న రాముడు
- ఉత్సాహంగా ఇండస్ట్రీ మీట్


ఇండస్ట్రీ మీట్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: పారిశ్రామికవేత్తలు, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పరస్పర సహకారంతోనే జిల్లాలో అభివృద్ధి సాధ్యమని జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు అన్నారు. జేఎన్ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో ఇండస్ట్రీ మీట్ పేరుతో బుధవారం ఒక రోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జేసీ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యం పెంచే ప్రయత్నంలో వారి సూచనలు సలహాలు స్వీకరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం సభానంతరం ప్యానల్ డిస్కషన్ సెషన్ నిర్వహించారు. సర్వారాయ షుగర్స్ ప్రతినిధి రాజ్‌కుమార్, ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి అశోక్ కుమార్, వరుణ్ మోటార్స్ ప్రతినిధి సుబ్బారావు, రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల ఎంప్లాయబిలిటీ స్కిల్ సెంటర్ ప్రతినిధి యర్రా రాము, నవతా ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు. ఆయా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామన్ శ్రీవనిధర్ రామన్, జిల్లా ఉపాధి కల్పనాధికారి హరిచంద్ర ప్రసాద్, యంగ్ ప్రొఫెషనల్ సీహెచ్ రాజ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధ్యానంతో మానసిక ప్రశాంతత


కార్యక్రమంలో మాట్లాడుతున్న పిరమిడ్ మాస్టర్ వంశీ కిరణ్

బిక్కవోలు: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని విశాఖపట్నం చెందిన పిరమిడ్ మాస్టర్ వంశీ కిరణ్ అన్నారు. కొంకుదురులోని శివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం 7వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారం తినడం, ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం స్వర్గీయ గోలుగూరి భాస్కరరెడ్డి, సుశీల దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా కేశవస్వామి గ్రామోత్సవం


గరుడ వాహనంపై విహరిస్తున్న కేశవస్వామి

బిక్కవోలు: పందలపాక గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారి గరుడ వాహనం గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకుడు వింజరపు కేశవాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రథం లాగారు.

ఘనంగా మదుగులమ్మ జాతర


ఆకట్టుకున్న గరగ నృత్యాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామ దేవత మదుగులమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, వివిధ వేషధారణల నడుమ గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం

బిక్కవోలు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించిన తర్వాత ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. ఎంటీటీ ట్రైనర్ సూరిశెట్టి సురేష్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాన్ని యాప్‌లో ఎలా పొందుపర్చాలో వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెంటెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. మొత్తం 480 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఏ సెంటర్‌లో 14 , బి సెంటర్‌లో 3 మంది పరీక్షలు రాయలేదన్నారు. డిపార్టుమెంటల్ అధికారులుగా ఏపీఆర్‌పీ ప్రసాద్, ఎంపీఎస్ కృష్ణ వ్యవహరించారు. కాగా.. పరీక్షా కేంద్రాన్ని ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్ఐఓ) వీఎల్ నరసింహం, సిట్టింగ్ స్క్వాడ్ పరిశీలించారు.

ఇంటి నిర్మాణాల పరిశీలన


గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈ రాజ్‌కుమార్ తదితరులు

రాజానగరం: ఇంటి నిర్మాణాలను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.రాజ్ కుమార్ లబ్ధిదారులకు సూచించారు. సూర్యారావుపేటలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలో 721 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని సత్వరమే నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.